
సాక్షి
జోగులాంబ గద్వాల
మంగళవారం । 26 । ఆగస్టు । 2025



రైతే ధర నిర్ణయించాలి

రైతుల కష్టంతో పండించిన పంటలకు రైతులే గిట్టుబాటు ధరలు నిర్ణయించే రోజులు రావాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొ.నాగేశ్వర్ అన్నారు.

-8లో ▸



వరద తగ్గుముఖం

భారీ వర్షాల నేపథ్యంలో గత పక్షం రోజులుగా కృష్ణానదికి ఎగువ నుంచి వస్తున్న వరద క్రమంగా తగ్గుముఖం పడుతోంది.

-8లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /21.7

వాతావరణం

ఉదయం నుంచి ఎండ ప్రభావం చూపిస్తుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత వారసులదే..



అలంపూర్: తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యతను వారి వారసులే తీసుకోవాలని అలంపూర్ జూనియర్ సివిల్ జడ్జి మిథున్ తేజ అన్నారు. సోమవారం అలంపూర్ కోర్టు ప్రాంగణంలో సీనియర్ సిటిజన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను వారి పిల్లలు సంరక్షించాలని, ఆస్తి పంపకాలు జరిగిన తర్వాత చాలా మంది కూతుళ్లు, కుమారులు తల్లిదండ్రులను పోషించకుండా వదిలేస్తున్నారని, దీని వల్ల వారి జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయన్నారు. ఇలాంటి సందర్భంలో చట్టం ప్రకారం ఆస్తిని తిరిగి తల్లిదండ్రులే పొందవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరు చట్టానికి లోబడి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గవ్వల శ్రీనువాసులు, న్యాయవాదులు ఈదుర్ బాషా,ఆఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



గద్వాలటౌన్: రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా మార్చడం కోసం క్షేత్రస్థాయిలో విస్తృత సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలను విస్మరిస్తే ప్రభుత్వంపై సమరం సాగిస్తామని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మ, ప్రధాన కార్యదర్శి సునిత హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోరతూ సోమవారం ఆశా కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, లేనిపక్షంలో తమ పోరాటం ఆపబోమని తేల్చిచెప్పారు. వీటితో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఆశా వర్కర్ల సంఘటిత పోరాటాల ఫలితంగానే రూ.200 నుంచి రూ.9500 వరకు వేతనాలు పెరిగాయన్నారు. ఆశా వర్కర్లపై రోజురోజుకు పని భారం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే దీర్ఘకాలిక ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహా, జిల్లా ఉపాధ్యాక్షుడు ఉప్పేర్ నర్సింహా, ధ్యమ్మ, మాధవి, కాంతమ్మ, చెన్నమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే



గద్వాలటౌన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి అమలు చేయాల్సిందేనని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం సోమవారం అఖిలపక్ష నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు అఖిలపక్ష నాయకులు మాట్లాడారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆర్డినెన్స్ ద్వారా తెచ్చి కేంద్రానికి పంపిందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రిజర్వేషన్లు అమలు చేయించే బాధ్యత తీసుకోవాలన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును శాసనసభ, మండలిలో ఆమోదం తెలిపి గవర్నర్ పరిశీలించి నివేదికను రాష్ట్రపతికి పంపించారన్నారు. మూడు నెలలు అవుతున్నా నిర్ణయం ప్రకటించలేదన్నారు. ఏ బిల్లు అయినా మూడు నెలల్లో నిర్ణయం తీసుకోకపోతే అమలు చేసినట్లేనని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లలో ముస్లింలను చేర్చుతున్నందుకే అనుకూలంగా లేమని బీజేపీ నాయకులు అనడం దారుణమన్నారు. ఇది ఆ వర్గంలో సామాజికంగా వెనకబడిన వారికి మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించి, బీసీలకు ద్రోహం చేయకుండా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించే పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అఖిల పక్ష నాయకులు సత్యనారాయణ, హనీఫ్, వినోద్, వాల్మీకి, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, మధుసూదన్‌బాబు, అతికూర్ రెహమాన్, ఇక్బాల్‌పాష, ప్రభాకర్, సుభాన్, హుస్సేన్ పాల్గొన్నారు.

నిరీక్షణకు తెర



గద్వాల మండలం సంగాల రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు వల విసురుతున్న మత్స్యకారుడు

చేపపిల్లల పంపిణీకి మోక్షం

- టెండర్ ప్రక్రియ ప్రారంభం
- సెప్టెంబర్‌లో 1.60 కోట్ల నుంచి 2 కోట్ల చేపపిల్లలు వదిలే అవకాశం

గద్వాల వ్యవసాయం: ఎట్టకేలకు ఉచిత చేప పిల్లల పంపిణీలో సందిగ్ధం తొలగింది. కొద్ది రోజులుగా ఎదురుచూస్తున్న మత్స్యకారుల నిరీక్షణకు తెరపడింది. ఈ ఏడాది (2025–26)లో చేపపిల్లల (సీడ్) పంపిణీ నిమిత్తం అవసరమైన టెండర్ ప్రక్రియ కొద్ది రోజుల క్రితం ఆరంభమైంది. మొత్తంగా ఈ ఏడాది చేపపిల్లల పంపిణీ ఉంటుందా.. ఉండదా అన్న అనుమానాలకు తెరపడింది. ఈనెలాఖరు నాటికి టెండర్ ప్రక్రియ ముగిసి, సెప్టెంబర్ మొదటి లేదా రెండో వారంలో జలాశయాల్లో చేపల సీడ్‌ను వదిలేలా మత్స్యశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 1.60కోట్ల నుంచి 2కోట్ల వరకు జలాశయాల్లో సీడ్‌ను వదిలే అవకాశం ఉంది.

జిల్లాలో నీటి వనరులు

జిల్లాలో 93 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా.. ఇందులో 7,162 మంది మత్స్యకారులు ఉన్నారు. వీరుగాక మరో 3వేల మంది దాకా చేపల విక్రయంపై ఆధారపడుతుంటారు. ఈ కుటుంబాలకు చేపలు, రొయ్యల పెంపకం, విక్రయించడమే జీవనాధారం. జిల్లాలో కృష్ణా, తుంగభద్ర నదులు, జూరాల ప్రాజెక్ట్, శ్రీశైలం బ్యాక్ వాటర్, ఆరు రిజర్వాయర్లు, 35 నోటిఫైడ్ చెరువులతో పాటు 396 చిన్న చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిలో ఏటా మత్స్యశాఖ అందించే చేపల, రొయ్యల సీడ్‌ను వదిలి పెంచుతున్నారు.

ఇదిలాఉండగా గత ప్రభుత్వం 2018–19లో తీసుకొచ్చిన సమీకృత మత్స్య అభివృద్ధి పథకంతో మత్స్యకారులకు రూ.2 కోట్లు విలువ చేసే ద్విచక్ర వాహనాలు, ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు, ట్రేలు, ఐస్‌బాక్స్‌లు, వలలు, ఎలక్ట్రానిక్ కాంటాలు తదితరమైనవి సమకూరాయి. వీటివల్ల మత్స్యకారులకు ఎంతో ప్రయోజనం చేకూరిందని చెప్పవచ్చు.

జిల్లా వివరాలిలా..

ఏడాది	వదిలిన చేపల సీడ్ సంఖ్య (కోట్లలో)
2017-18	1.01
2018-19	0.59
2019-20	1.02
2020-21	1.15
2021-22	1.50
2022-23	1.69
2023-24	1.78
2024-25	1.30

ఇటీవల టెండర్ ప్రక్రియ

సాధారణంగా జూలై నెలలో టెండర్లు ఆహ్వానించి ఆగస్టు నెలలో చేప సీడ్‌ను వదులుతారు. అయితే ఈఏడాది ప్రభుత్వం సకాలంలో బడ్జెట్ కేటాయింపు జరపకపోవడం వల్ల ఆలస్యం అయ్యింది. ఈనెల 18న టెండర్ నోటిఫికేషన్ జారీ జరిగింది. 35ఎంఎం నుంచి 40ఎంఎం సీడ్‌కు రూ.62పైసలు, 80ఎంఎం నుంచి 100ఎంఎం సీడ్‌కు రూ.1.65పైసలు రేటుగా నిర్ణయించి టెండర్లు ఆహ్వానించారు. సెప్టెంబర్ 1న టెండర్లు ఓపన్ చేసి కాంట్రాక్టర్‌ను ఖరారు చేయనున్నారు.

త్వరలో చేపపిల్లలు వదులుతాం



2025–26 సంవత్సరానికి చేపల సీడ్ వదిలేందుకు అవసరమైన టెండర్ ప్రక్రియ ఆరంభం అయ్యింది. సెప్టెంబర్ 1నాటికి టెండర్ ఓపెన్ చేస్తారు. జిల్లాలో సెప్టెంబర్ మొదటి వారం లేదా రెండో వారంలో చేపల సీడ్ వదిలేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. దాదాపు 60 శాతం నీరు నిండిన జలాశయాల్లో చేపలు వదిలేందుకు నిర్ణయించాం.

– షకీలాభానో, జిల్లా మత్స్యశాఖ అధికారి

అన్ని చెరువుల్లో వదిలితేనే ప్రయోజనం

చేప పిల్లలను వదలాలంటే జలాశాయాల్లో 60 శాతం నీళ్లు ఉండాలి. అయితే ఎగువన కురిసిన వర్షాల జూరాల జలాశయానికి భారీగా వరద నీరు చేరింది. దీంతో నెట్టెంపాడు ఎత్తిపోథల ద్వారా రిజర్వాయర్లకు, పలు పెద్ద చెరువులకు నీటిని విడుదల చేశారు. దీంతో పాటు జూలై చివరివారం, ఆగస్టు నెలలో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. అవకాశం ఉన్న ప్రతి జలాశయంలోను చేపపిల్లలను వదలాలని మత్స్యకారులు కోరుతున్నారు. ఎందుకంటే 2023–24 సంవత్సరంలో 1.78 కోట్ల చేపల సీడ్‌ను వదలగా.. 2024–25లో 1.30కోట్ల సీడ్‌ను మాత్రమే వదిలారు. ఆ ఏడాది ఒక్క గద్వాల మండలంలోనే సంగాల, జములమ్మ చెరువులతో పాటు, పర్మాల, జిల్లెబండ లాంటి దాదాపు 20కి పైగా చిన్న చెరువుల్లో చేపల సీడ్‌ను వదలేదు. దీనివల్ల తాము ఆర్థికంగా చాలా నష్టపోయామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ ఏడాదైన ఆయా జలశయాల్లో నీటి లభ్యత ఆధారంగా డిమాండ్ మేరకు సీడ్ వదలాలని, మత్స్యకారులకు మెరుగైన ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.

ఆ తర్వాత సెప్టెంబర్ మొదటి లేదా రెండో వారంలో సీడ్‌ను వదిలేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి



డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్, జిల్లా అధికారులు

- వచ్చే నెలలో డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రారంభోత్సవం
- కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాలటౌన్: పట్టణ శివారులో చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల అసంపూర్తి పనులను త్వరగా పూర్తి యాలని, వచ్చే నెల మొదటి వారంలో ఇళ్ల ప్రారంభోత్సవం ఉంటుందని కలెక్టర్ సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం డబుల్ బెడ్ రూం ఇళ్లను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకున్నారు. డబుల్ ఇళ్ల నిర్మాణాలలో తక్షణమే మౌలిక వసతులు కల్పించాలని, పెండింగ్ ఉన్న విద్యుత్ సౌకర్యాలు, పెయింటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ముళ్ల పొదలను తొలగించి, పరిసరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. విద్యుత్తు, తాగునీటి సరఫరాలో లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్దాలన్నారు. రహదారి పనులను పూర్తి చేయాలన్నారు. ఇళ్ల పరిశీలన అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ డీఈ తిరుపతిరావు, మున్సిపల్ కమిషనర్ జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించండి

ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు తక్షణం స్పందించాలని, లేదంటే చర్యలు తప్పవని కలెక్టర్ సంతోష్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఆసరా పెన్షన్లు, భూసంబంధిత, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, ఉపాధి, విద్యుత్ తదితర సమస్యలపై 72 వినతులు వచ్చాయి. ఆయా జిల్లా శాఖల అధికారులు సంబంధిత మండల అధికారులతో చర్చించి వారి పరిధిలోని దరఖాస్తులను పరిష్కరించాలని చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషినల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ పరికరాలు పంపిణీ

చేనేత పెన్షన్లు మరింత పారదర్శకంగా, సులభంగా లబ్ధిదారులకు అందించే విధంగా పోస్టల్ శాఖ ద్వారా ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీని అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ సంతోష్ తెలిపారు. సోమవారం బ్రాంచ్ పోస్టుమాస్టర్లు, సబ్ పోస్టుమాస్టర్లు బయోమెట్రిక్ పరికరాలు, స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. మొత్తం 84 మందికి కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పోస్టు ఆఫీస్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియమాలు పాటిస్తే నిర్విఘ్నం



గద్వాలలో ప్రతిష్టాపన కోసం భారీ గణనాథుడిని ఊరేగింపుతో తీసుకొస్తున్న భక్తులు

- వినాయక మండపాల ఏర్పాటు వేడుకల్లో అప్రమత్తత అవసరం
- పోలీసులు, అధికారుల సూచనలు శిరోధార్యం

గద్వాలటౌన్: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న వినాయక చవితా రానే వచ్చింది. కుల, మతాలకతీతంగా వాడవాడలా విఘ్న నాయకులను భక్తి శ్రద్ధలతో నెలకొల్పే సమయం ఆసన్నమైంది. గణేష్ నవరాత్రి వేడుకలు ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే భక్తులు ఉత్సవాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. విగ్రహ మండపాల ఏర్పాటు, పూజలు, ఊరేగింపు, నిమజ్జనం ఇలా ప్రతి సందర్భంలో చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే నవరాత్రులు విజయవంతమేనట్లే.. విఘ్నేశ్వరుడి కృపాకటాక్షాలు లభించినట్లే. ఈ నేపథ్యంలో నిర్వహకులు ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలి.

సామాన్యులకు ఆటకం కలిగించొద్దు

వినాయకుడి మండపాలను నిర్మించే సమయంలో సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలి. రహదారి మధ్యలో మండపాలు నిర్మిస్తే వాహనాల రాకపోకలు, ఇతరత్రా ఇబ్బందులు ఎదురవుతాయి. రోడ్డు పక్కన, ఖాళీ స్థలంలో నిర్మించాలి. అలాగే, శోభాయాత్రలో యువత మద్యం మత్తులో జోగుతూ నృత్యాలు చేస్తుంటారు. నిమజ్జనం రోజు సైతం మద్యం తాగకుండా భక్తితో వేడుకల్లో పాల్గొనాలి. శోభయాత్రలో విద్యుత్తు తీగలను పరిశీలిస్తూ అప్రమత్తంగా వాహనం ముందుకు సాగాలి.


అనధికార కనెక్షన్లతో ముప్పు

మండపాలకు విద్యుత్ కనెక్షన్లు అనధికారికంగా తీసుకోవద్దు. అధికారిక కనెక్షన్లు అయితే విద్యుత్తు సిబ్బంది వచ్చి పరిశీలించి వైరింగ్ సక్రమంగా ఉండేలా చేస్తారు. విద్యుత్ తీగల కింద ఏర్పాటు చేయొద్దు. అలాంటి పరిస్థితి ఉంటే విగ్రహాలను వాహనాల నుంచి దించేటప్పుడు, మండపంలో ప్రతిష్ఠించేటప్పుడు చుట్టుపక్కల పైభాగాల్లో పరిశీలించాలి. అలాగే, మండపాల వద్ద టపాసులు, ఇతర మందుగుండు సామగ్రి ఉంచొద్దు. 24 గంటలు సభ్యులు ఉండాలి. ఒక డ్రమ్‌లో నీరు, రెండు బకెట్లలో ఇసుక నింపి ఉంచుకోవాలి. శాంతి కమిటీ సమావేశంలో పోలీసులు, అధికారులు సూచించే అంశాలను పాటించాలి. నిమజ్జనం రోజు చెరువుల్లో గుంతలు ఉంటాయి. నది, కాలువల్లో నీటి ప్రవాహం ఉంటుంది. కాబట్టి జాగ్రత్తలు తీసుకోవాలి.

అధిక శబ్దాలు వద్దు

పూజలు నిర్వహించే వేళల్లో వేదమంత్రాలు స్థానికులందరికీ వినిపించేలా మైకులు, డీజే బాక్సులు, భారీ స్పీకర్లు ఏర్పాటు చేస్తుంటారు. డీజేలకు అనుమతి లేదు. స్పీకర్లు, మైకు ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పని సరి. రోజంతా భక్తి గీతాలు మోగించడంతో చిన్నారులు, వృద్ధులు, విద్యార్థులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. పూజ జరిగే వేళల్లోనే తక్కువ శబ్దంతో మైకులు వాడటం ఉత్తమం. అలాగే, మండపాలను నాణ్యమైన వస్తువులతో నిర్మించుకోవాలి. సత్ప్రవర్తన కలిగిన సభ్యులను నియమించుకుని భక్తులను క్రమబద్ధీకరించేలా చూసుకోవాలి. అదేవిధంగా సామూహిక వేడుకలు, మండపాల వద్ద భక్తులు గణనాథుని దర్శనానికి బారులుతీరుతారు. రద్దీ ప్రాంతాలలో చోరీలు జరిగే అవకాశాలు లేకపోలేదు. అప్రమత్తంగా ఉండాలి. మండపాల అలంకరణ, నిమజ్జనం రోజు అధికంగా ఖర్చు చేయడం కంటే అన్నదానాలు, పిల్లలకు విజ్ఞాన, వినోద కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం సముచితం.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఇటిక్యాల శివారులో జంతువు సంచరించిన ఆనవాళ్లను గుర్తించిన ఫారెస్ట్ అధికారి

ఎర్రవల్లి: పులి సంచరించింది అనే వార్తల నేపథ్యంలో ఇటిక్యాల మండలంలోని ఉదండాపురం, షాబాద్, చాగాపురం, పెద్దదిన్నె, బట్లదిన్నె శివార్లలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ సెక్షన్ అధికారి మన్యమయ్య అన్నారు. మండల శివారులో పులి సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు సోమవారం వైరల్ కావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ సెక్షన్ అధికారి పలు ప్రాంతాల్లో పర్యటించారు. గుర్తు తెలియని జంతువు సంచరించిన ఆనవాళ్లని గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంచరించిన జంతువు పులి అనడానికి పూర్తి స్థాయిలో నమ్మదగిన ఆనవాళ్లు కనబడలేదని, అటుగా చూసిన వాళ్లు మాత్రమే జింకలతో పాటు పులి, రెండు పులి పిల్లలు ఉన్నాయి అని చెప్పారన్నారు. పై గ్రామాల్లో పంట పొలాల్లో పనికి వెళ్లే రైతులు, కూలీలు, గొర్రెలు, బర్రెల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైన పులి కనబడితే వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు : ఎస్పీ

గద్వాల క్రైం: పాఠశాల, కళాశాల, హాస్టల్స్‌లలో జూనియర్స్, సీనియర్స్ అంటూ ఎవరైన ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలలో ర్యాగింగ్ కట్టడికి యాజమాన్యం యాంటీ ర్యాగింగ్ కమిటీలు, స్క్వాడ్‌లను ఏర్పాటు చేసుకోవాలని, తరచూ విద్యార్థుల వ్యవహార శైలిని గమనిస్తు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యాసంస్థలలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికాలను అందజేయాలని, విద్యా వ్యవస్థలో నిబంధనలు ఉల్లంఘించి ఎవరైన వ్యవహరిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందజేయాలని ఎస్పీ సూచించారు.

అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



రాజోళి/శాంతినగర్: అంబులెన్స్ సేవలను ప్రతి గ్రామ ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని జిల్లా అధికారి రత్నమయ్య అన్నారు. సోమవారం రాజోళి, వడ్డేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 108 అంబులెన్స్‌లను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అంబులెన్స్ ద్వారా ఏ పరిస్థితుల్లో ఎలాంటి వారిని ఆసుపత్రులకు చేర్చిన వివరాలను ఆరా తీశారు. అంతేగాక 108, 102 వాహనాల్లోని ఆక్సిజన్ సిలిండర్లు, మెడికల్ ఎక్విప్‌మెంట్‌లు, మెడిసిన్స్ చెక్ చేశారు. అత్యవసర సమయంలో 108, 102 సేవలు ప్రజలు ఉపయోగించుకోవాలని, వాటి ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది కూడా ప్రజలకు అంబులెన్స్‌ల సేవలను గురించి తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీయూలో సబ్‌స్టేషన్ వివాదం!

500 గజాలే కేటాయించామని పీయూ అధికారుల స్పష్టం

పాలమూరు యూనివర్సిటీలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం కేటాయించిన భూమిపై వివాదం నెలకొంది. తాము 500 గజాల భూమిని కేటాయించామని పీయూ అధికారులు.. తమకు ఒక ఎకరా భూమిని కేటాయించారని ట్రాన్స్‌కో అధికారులు భిన్నవాదనలు వినిపిస్తున్నారు. తాజాగా ఎకరంన్నర భూమిని చదును చేయడంపై అటు పీయూ అధికారులు, విద్యార్థి సంఘాల నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వేలాది మంది విద్యార్థుల ఉన్నత చదువులకు బాసటగా నిలిచే పీయూకు నూతన హాస్టల్స్, ల్యాబ్స్, తదితర వాటి ఏర్పాటు నేపథ్యంలో మరింత భూమి సమకూర్చాల్సింది పోయి..ఉన్న భూమిని వేరే వాటికి కేటాయించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పీయూలో కొనసాగుతున్న సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు

- ఎకరా కేటాయించారని విద్యుత్ అధికారుల వాదన
- అధిక భూసేకరణపై వీసీ లేఖ.. నేటికీ స్పందించని ట్రాన్స్‌కో
- పీయూ భూమి కాపాడాలంటూ విద్యార్థి సంఘాల ఆందోళన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బండమీదిపల్లితో పాటు చుట్టుపక్కల ఉన్న కాలనీలకు నాణ్యమైన విద్యుత్‌ను అందజేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు అక్కడ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలం కోసం వెతికారు. సరైన స్థలం దొరక్కపోవడంతో పీయూలో పీజీ కళాశాల పక్కన..రాయచూర్ రోడ్డును ఆనుకుని ఉన్న స్థలాన్ని కేటాయించాలని అధికారులను కోరారు. ఈ క్రమంలో పీయూ అధికారులు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ అనుమతితో విద్యుత్‌శాఖకు 500 గజాల భూమిని కేటాయిస్తూ అనుమతులు ఇచ్చారు. సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు కొన్ని రోజులుగా పనులు సైతం ప్రారంభించారు. అయితే, వారికి కేటాయించిన భూమికి మించి ఎక్కువ భూమిని చదును చేసుకుని వినియోగిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. తాము కేవలం 500 గజాలు ఇచ్చామని పీయూ అధికారులు పేర్కొంటుంటే, విద్యుత్‌శాఖ తమకు ఒక ఎకరా భూమి కేటాయించారని పేర్కొంటున్నారు. ఈనేపథ్యంలో ఎకరంన్నర భూమిని చదును చేయడంతో వివాదం మరింత రాజుకుంది. ఎక్కువ భూమిని ఎలా చదును చేసి వినియోగిస్తారంటూ ఇటీవల పీయూ వీసీ శ్రీనివాస్.. ట్రాన్స్‌కో అధికారులకు లేఖ రాశారు. కానీ అక్కడి నుంచి ఎలాంటి స్పందన రాలేదని తెలుస్తోంది.

ఒక్క గజం ఎక్కువ తీసుకోం..

పీయూలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు అధికారులు ఒక ఎకరా భూమిని కేటాయించారు. అందులో భాగంగానే ఇక్కడ భూమిని చదును చేశాం. ఎకరం కంటే ఎక్కువ భూమిని ఎట్టి పరిస్థితుల్లో వినియోగించుకోం.

– సుదీర్‌రెడ్డి, ఈఈ, ట్రాన్స్‌కో

లేఖ రాశాం



పీయూలో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం విద్యుత్‌శాఖ అధికారుల విజ్ఞప్తి మేరకు కేవలం 500 గజాల భూమిని మాత్రమే కేటాయించాం. వారు ఎక్కువ భూమిని చదును చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై సదరు డిపార్ట్‌మెంట్ వారికి లేఖ సైతం రాశాం. ఎక్కువ భూమిని వినియోగించుకోవడానికి అవకాశం లేదు.

– శ్రీనివాస్, పీయూ వైస్‌చాన్స్‌లర్

రోడ్డు విస్తరణ పనుల్లో మరింత భూమి..

పీయూకు ఆనుకుని ఉన్న వెటర్నరీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సుమారు 20 ఎకరాల భూమిని పీయూకు అధికారులు బదిలీ చేశారు. ఇందుకు 2019లో కలెక్టర్ రొనాల్డ్ రోస్, వీసీ రాజతర్నం ఎంతో కృషి చేశారు. అయితే, గతేడాది భూత్పూర్- చించోలి రోడ్డు పనులు ప్రారంభం కాగా.. పీయూకు చెందిన భూమి సైతం పోయింది. పీయూ కాంపౌండ్ వాల్‌ను తొలగించి పనులు కొనసాగించారు. ఇటు రోడ్డు విస్తరణ, అటు సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం దాదాపు 5 ఎకరాల వరకు పీయూ భూమిని కోల్పోయినట్లు తెలుస్తుంది. దీనికి ప్రత్యామ్నాయంగా పీయూకు ప్రభుత్వం మరింత భూమిని కేటాయించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో అధికారులు పీయూకు భూమిని సమకూర్చేందుకు ప్రయత్నం చేస్తే.. ప్రస్తుత అధికారులు ఉన్న భూమిని కాపాడే పరిస్థితి లేదన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇకనైన అధికారులు మేల్కొని పీయూ భూములను పరిరక్షించాలని విద్యార్థులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పాము కాటుకు మహిళ మృతి


పార్వతమ్మ (ఫైల్)

ధరూరు: పాము కాటుకు గురై ఓ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని గార్లపాడులో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మంగలి మైసూర్‌కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య సత్యమ్మకు ఇద్దరు కుమారులు. ఆమె కొన్నేళ్ల క్రితం మృతి చెందింది. రెండో భార్య అయిన పార్వతమ్మ (56)కు సంతానం కలుగలేదు. మొదటి భార్య కుమారుడు రఘు పొలం వద్ద పని చేస్తుండగా పార్వతమ్మ సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో పాము కాటుకు గురైంది. గమనించిన రఘు ఆమెను వైద్యం కోసం గద్వాల ఆస్పత్రికి తరలించారు. వివిధ పరీక్షలు నిర్వహించి పరీక్షించిన వైద్యులు పార్వతమ్మ అప్పటికే మృతి చెంది నట్లు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అచ్చంపేట రూరల్: విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని బొల్గట్‌పల్లిలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. సొంత పొలంలో బోరు మోటార్ వేయడానికి వెళ్లిన స్వాములు(49) విద్యుదాఘాతానికి గురయ్యాడని స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వారు పొలంలో స్వాములు విగతజీవిగా పడి ఉండటం గమనించి వెంటనే అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో ఎస్‌ఐ ఇందిర తెలిపారు.

చంపేందుకు మందు పెట్టిందనే అనుమానంతో..

- భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త


బాలమణి(ఫైల్).

మిడ్జిల్: క్షణికావేశంతో తాళి కట్టిన భార్యను భర్త గొడ్డలితో నరికి చంపిన ఘటన సోమవారం మిడ్జిల్ మండలంలోని బైరంపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బండారి బచ్చయ్య మద్యానికి బానిసై గ్రామంలో తరచూ గొడవ పడుతుండడంతో భార్య బాలమణి (48) అతడితో మద్యం మాన్పించేందుకు వారం రోజుల క్రితం నాటు మందు తాగించింది. ఈ విషయం ఆదివారం రాత్రి బచ్చయ్యకు చెప్పడంతో భార్య తనను చంపేందుకు మందు పెట్టించిందని భావించి, సోమవారం మధ్యాహ్నం ఇంట్లో నిద్రిస్తున్న బాలమణిని గొడ్డలితో నరికాడు. దీంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలి చనిపోయింది. ఆ తర్వాత ఇంటికి తాళం వేసి బయట కూర్చున్నాడు. గ్రామస్తులకు అనుమానం వచ్చి తలుపు తెరిచి చూసే సరికి ఆమె రక్తపు మడుగులో చనిపోయి ఉంది. విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు అక్కడికి చేరుకొని బచ్చయ్యను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఘటన స్థలానికి జడ్చర్ల రూరల్ సీఐ నాగరాజుగౌడ్ చేరుకొని విచారణ చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కొడుకు రెండేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడని, కుమార్తెకు వివాహం అయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసెలు దగ్ధం



మక్తల్: షార్ట్ సర్క్యూట్‌తో రెండు గుడిసెలు దగ్ధమైన ఘటన మండలంలోని గడ్డంపల్లి ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పూర్తి వివరాలు.. గ్రామానికి చెందిన గుడేసల కుర్మన్న కుమారుడి ఇంటికి వెళ్లాగా అదే సమయంలో అతను నివాసముంటున్న గుడిసెలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో పాటు సిలిండర్ కూడా పేలింది. ఈ క్రమంలో అదే గుడిసెకు అనుకొని ఉన్న కుర్మన్న తమ్ముడు సావరన్న గుడిసెకు కూడా నిప్పు అంటుకోవడంతో రెండు గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయి. కుర్మన్నకు చెందిన 50 తులాల వెండి, రూ.50 వేల నగదు, నిత్యావసర వస్తువులు, సావరన్నకు చెందిన రూ.1.30 లక్షల నగదు, 6 తులాల బంగారం, వస్తువులు ప్రమాదంలో పూర్తి కాలిపోయినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం సంభవించడంతో బజారున పడే పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. విషయం తెలుసుకున్న మక్తల సీఐ రాంలాల్, ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సోమవారం కుర్మన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రైతే ధర నిర్ణయించే రోజులు రావాలి


పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలభారత ఐక్య రైతు సంఘం నాయకులు

- మాజీ ఎమ్మెల్సీ ప్రొ.కె.నాగేశ్వర్
- అట్టహాసంగా ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రథమ మహాసభలు ప్రారంభం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ప్రొ.కె.నాగేశ్వర్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రైతుల కష్టంతో పండించిన పంటలకు రైతులే గిట్టుబాటు ధరలు నిర్ణయించే రోజులు రావాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొ.కె. నాగేశ్వర్ అన్నారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రథమ మహాసభలు రాష్ట్ర అధ్యక్షుడు రంగారెడ్డి అధ్యక్షతన సోమవారం జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మెట్టుగడ్డ నుంచి బాయ్స్ కాలేజీ వరకు రైతులతో భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఆగస్టు 15న దేశ ప్రజలకు అండగా ఉంటానన్న ప్రధాని మోదీ మరుసటి రోజే విదేశాల నుంచి పత్తిని దిగుమతి చేసుకొని దిగుమతి సుంకాన్ని ఎత్తివేశారని ఆరోపించారు. విదేశాల పత్తిని కొనుగోలు చేయడంతో ఇక్కడి పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. అదానీ, అంబానీ లాంటి కంపెనీలు వచ్చి రాబోయే కాలంలో రైతులను పీడించనున్నాయన్నారు. ఫిబ్రవరిలో 10లక్షల టన్నుల యూరియాను తెలంగాణకు ఇస్తామని చెప్పి సగం కోత విధించారని ఆరోపించారు. పండించిన పంటకు గిట్టుబాటు ధరలు ఇవ్వమంటే కార్పొరేట్లకు లక్షల కోట్లు మాఫీ చేసి రైతుల నోట్లో మట్టి కొట్టారన్నారు. సినిమా టికెట్లు రేట్లు పెంచుకునే అధికారం ఇచ్చినప్పుడు రైతులు పండించిన పంటకు రేట్లు పెంచుకునే అధికారం ఎందుకివ్వడంలేదని ప్రశ్నించారు. ఇవన్నీ విషయాలపై కొట్లాడితే అర్బన్ నక్సల్స్ అంటున్నారని, హిందూ ముస్లిం గొడవలు తెచ్చి దేశ ద్రోహులుగా చిత్రీకరించే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. పాలకులు తీసుకొస్తున్న చట్టాలన్నీ రైతులకు వ్యతిరేకంగా, కార్పొరేట్‌కు అనుకూలంగా ఉన్నాయన్నారు. రైతులు తమ హక్కుల సాధనకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు మాట్లాడుతూ.. రైతాంగం నేడు దుర్భరమైన స్థితిలో ఉందన్నారు. ఓట్ల దొంగతనం చేసి అధికారంలోకి వచ్చారని ప్రతిపక్షం ఆధారాలతో నిరూపిస్తే వారిని అణచివేసే కుట్రలు చేస్తున్నారని బీజేపీపై మండిపడ్డారు. పాలమూరు బిడ్డనని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలమూరు–రంగారెడ్డి పథకానికి అరకొర నిధులు కేటాయించడం తగదన్నారు. కార్యక్రమంలో రైతు, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాల నేతలు సాంబశివుడు, కాశీనాథ్, యాదగిరి, రాజన్న, కొండా రెడ్డి, మణ్యం, రామకృష్ణ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బు రాజకీయాలు మారాలి

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి
- సురవరం పుస్తకావిష్కరణ


సురవరం ప్రతాపరెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చిన్నారెడ్డి, దిలీప్‌రెడ్డి, పాండురంగారెడ్డి

వనపర్తిటౌన్: ఈసీ ఓట్ల చోరీపై రాహుల్‌గాంధీ చేస్తున్న పోరు తరహాలో డబ్బు రాజకీయాలను మార్చేందుకు యువత ముందుకు రాకపోతే దేశాన్ని ఎవరూ రక్షించలేరని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సురవరం ప్రతాప్‌రెడ్డి పుస్తకావిష్కరణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వందేళ్లలో పూర్తి చేయాల్సిన పనులను 50ఏళ్ల జీవితంలో పూర్తి చేసి తరగని ముందుచూపుతో కాలంకంటే ముందు నడిచిన మేధావిగా సురవరం ప్రసిద్ధికెక్కారని చెప్పారు. ప్రతాపరెడ్డిలాంటి మహోన్నతుడు భవిష్యత్‌లో పుట్టడం అసాధ్యమన్నారు. వనపర్తిలో సురవరం, ప్రజావైద్యుడు మాధవరెడ్డి విగ్రహాలను వచ్చే ఏడాది ఏర్పాటు చేస్తామన్నారు. సురవరం కుమారుడు డాక్టర్ కృష్ణవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతాపరెడ్డికి రావాల్సిన స్థాయిలో గుర్తింపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సమాజానికి పరితపించిన సురవరం రచనలు, కృషి సామాన్యుల దరికి చేరాల్సిన అవసరం ఉందన్నారు.

రెండో ప్రపంచ యుద్ధంలో వనపర్తి సైనికులు

ఇండియన్ ఆర్మీలో వనపర్తి, హైదరాబాద్ సైనికులు ప్రధాన భూమిక పోషించారని తెలంగాణ చరిత్ర అధ్యయన కేంద్రం చైర్మన్, మానవ వనరుల విభాగం రాష్ట్ర ప్రతినిధి పాండురంగారెడ్డి, ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి పేర్కొన్నారు. వనపర్తి పోరుగడ్డతోపాటు కళం గడ్డగా ప్రసిద్ధి చెందిందన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో వనపర్తి సైనికులు పాల్గొన్నారని, ఈ ప్రాంతం విశేష ప్రాధాన్యత కలిగినదన్నారు. కార్యక్రమంలో నాయకులు శిల్ప, అనురాగ్‌రెడ్డి, భీంపల్లి శ్రీకాంత్, అమరేందర్‌రెడ్డి, బిక్షం, జలంధర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, రాజేంద్రప్రసాద్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పతకాలు సాధించడం అభినందనీయం


విద్యార్థులను అభినందిస్తున్న డీవైఎస్ఓ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ క్రీడలు: కేంద్రీయ విద్యాలయ జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో జిల్లా విద్యార్థులు పతకాలు సాధించడం అభినందనీయమని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్‌లోని బొల్లారంలో ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు జరిగిన 54వ కేంద్రీయ జాతీయ ఆర్చరీ క్రీడా పోటీల్లో కంపౌండ్ కేటగిరిలో మహబూబ్‌నగర్‌కు చెందిన విద్యార్థులు స్మృతి సన్నిభా ఫస్ట్‌రౌండ్, సెకండ్ రౌండ్‌లో బంగారు పతకాలు, కృతిక్ శ్రీవత్సవ్ ఫస్ట్‌రౌండ్‌లో రజతం, సెకండ్ రౌండ్‌లో కాంస్య పతకాలు సాధించడంపై సోమవారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేరుశనగ పొట్టుతో గణేశుడు

కరీంనగర్ ప్రజావాణిలో ప్రదర్శన


శ్రీజతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: వేరుశనగ పొట్టుతో తయారు చేసిన వినాయక విగ్రహాలు ప్రజావాణి కార్యక్రమంలో ఆకట్టుకున్నాయి. జోగులాంబ గద్వాల్ జిల్లాకు చెందిన శ్రీజ.. గ్రీన్ గెలాక్సీ సంస్థను నిర్వహిస్తోంది. ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించగా.. మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. అయితే, వేరుశనగ పొట్టుతో తయారు చేయించిన.. పర్యావరణానికి మేలు వినాయక విగ్రహాలను మంత్రి, కలెక్టర్‌కు అందజేశారు. వీటిని కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ప్రదర్శించాలని కలెక్టర్ అప్పుడు సూచించారు. దీంతో సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో వేరుశనగ పొట్టుతో తయారుచేసిన గణపతి విగ్రహాలు ప్రదర్శించారు. ప్రతిమలు ఆకర్షణీయంగా ఉండటంతో అధికారులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. శ్రీజ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆమె ఇప్పటికే ఇలాంటి పర్యావరణహితమైన అనేక ప్రయోగాలు చేసి పలువురు ప్రముఖుల మన్ననలు పొందింది.

వివాహేతర బంధం.. నర్సు ఆత్మహత్యాయత్నం

- వేధింపులు తాళలేక ట్యాబ్‌లెట్లు మింగిన వైనం
- గుట్టుచప్పుడు కాకుండా చికిత్స అందిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు

మహబూబ్‌నగర్ క్రైం: ఇద్దరు పిల్లలు ఉన్న వివాహిత.. ఓ యువకుడితో వివాహేతర సంబంధం పెట్టుకోగా, అతనికి తెలియకుండా మరో వ్యక్తితో చాటింగ్ చేస్తున్న క్రమంలో జరిగిన వాగ్వాదంలో ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే నగరంలోని క్రిస్టియన్ కాలనీకి చెందిన వివాహిత సత్యం చౌరస్తాలోని ఓ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో గైనిక్ విభాగంలో నర్సుగా పని చేస్తోంది. అదే ఆస్పత్రిలో కార్డియాలజీ విభాగంలో పని చేసే ఓ యువకుడితో రెండేళ్లుగా అక్రమ సంబంధం కొనసాగిస్తుంది. ఇటీవల ఆమె మరో వ్యక్తితో చాటింగ్ చేస్తున్నట్లు గుర్తించిన సదరు యువకుడు ఆమెతో తరచూ గొడవపడుతున్నాడు. ఆదివారం రాత్రి ఇద్దరి మధ్య జరిగిన వాగ్వాదంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నట్లు తెలుస్తోంది. అనంతరం ఆమె అధిక మోతాదులో పలు రకాల ట్యాబ్‌లెట్లు వేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. సదరు మహిళ ఆత్మహత్యాయత్నాన్ని ఆస్పత్రిలో చేసిందా లేదా ఇంట్లోనా అన్న విషయంపై స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో మహిళ విధులు నిర్వర్తిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు ఆమెకు సోమవారం గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఎంఎల్‌సీ చేయించి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. అయితే సదరు యువకుడిని ఇంట్లో పెట్టి తాళం వేసినట్లు కూడా ప్రచారం జరిగింది. ఈ ఘటనకు ఆస్పత్రికి ఎలాంటి సంబంధం లేదని ఆస్పత్రి యజమాని, సీనియర్ వైద్యుడు అందరిని చక్కదిద్దుతున్న పనిలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

మహబూబ్‌నగర్ 331 ఆలౌట్


అబ్దుల్ రాఫే (73 పరుగులు)

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని కేసీఆర్–2 మైదానంలో సోమవారం బీ–డివిజన్ టూడే లీగ్ చాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్–ఖమ్మం జట్ల మధ్య లీగ్ ప్రారంభమైంది. జరిగింది. తొలి రోజు మహబూబ్‌నగర్ 87.1 ఓవర్లలో 331 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో అబ్దుల్ రాఫే 73 పరుగులు (111 బంతుల్లో, 14 ఫోర్లు), ఛత్రపతి 63 పరుగులు (169 బంతుల్లో, 9 ఫోర్లు), కేతన్‌కుమార్ 62 పరుగులు (85 బంతుల్లో, 12 ఫోర్లు) రాణించారు. ఖమ్మం బౌలర్లు వి.మహేష్, విశాల్ యాదవ్ మూడేసి వికెట్లు తీసుకున్నారు. మంగళవారం ఖమ్మం బ్యాటింగ్ చేయనుంది.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కంట్రోలర్


ఎస్వీడీసీ కళాశాల పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న కంట్రోలర్ ప్రవీణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ పరిధిలో జరుగుతున్న డిగ్రీ, పీజీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎస్వీడీసీ కళాశాల పరీక్ష కేంద్రాలన్ని పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రవీణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి మాస్‌కాపీయింగ్‌కు పాల్పడకుండా చూడాలని, కాపీయింగ్‌కు పాల్పడి చర్యలు తీసుకుంటామని సూచించారు.

కార్గో హమాలీ కూలీరేట్ల పెంపునకు అంగీకారం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గోలో పనిచేస్తున్న హమాలీ కార్మికుల రేట్ల పెంపునకు అంగీకారం కుదిరిందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సురేశ్ తెలిపారు. ఆర్టీసీ లాజిస్టిక్ కేంద్రంలో పనిచేస్తున్న హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని వారం కిందట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నోటీస్ అందజేసిన నేపథ్యంలో సోమవారం కాంట్రాక్టర్‌తో సుదీర్ఘంగా చర్చలు చేసినట్లు తెలిపారు. పెంచిన కూలీ రేట్లు నేటినుంచి అమల్లోకి తెస్తామన్నారు. కూలీరేట్ల పెంపునకు అంగీకరించిన కార్గో ఏజెన్సీ కాంట్రాక్టర్, ఆర్టీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రంగన్న, శంకరయ్య, హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు వరద తగ్గుముఖం

- ప్రాజెక్టుకు 2.98 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రాజెక్టు 26 క్రస్టు గేట్ల ఎత్తివేత
- 2.69 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

ధరూరు: ఎగువన కురిసిన భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం ప్రాజెక్టుకు 3.72 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. సోమవారం రాత్రి 8.30 గంటల వరకు స్వల్పంగా తగ్గి ఇన్‌ఫ్లో 2.98 లక్షల క్యూసెక్కులకు తగ్గినట్లు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 26 క్రస్టు గేట్లను ఎత్తి 2,67,527 క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 43 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 820 క్యూసెక్కులు, కుడి కాల్వకు 680 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 600 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,69,670 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.855 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. రెండో రోజు జెన్‌కో జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని నిలిపివేసినట్లు పేర్కొన్నారు.

నిలిచిన విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ కర్ణాటక రాష్ట్రం నుంచి వరద భారీగా చేరుతుండడంతో దిగువ, ఎగువ జూరాల జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 533.580 ఎంయూ విజయవంతంగా చేపట్టినట్లు పేర్కొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తివేత

దోమలపెంట: శ్రీశైలం ప్రాజెక్టుకు కొంతమేర వరద ప్రవాహం తగ్గడంతో సోమవారం మూడు గేట్లు మూసి వేసి..ఏడు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు స్పిల్ వే ద్వారా 2,69,917, సుంకేసుల నుంచి 9,039 మొత్తం 2,88, 263 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం ప్రాజెక్టుకు వస్తుండగా.. 7 గేట్లను పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1,87,208 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. మరో వైపు ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడి గట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 26,845 మొత్తం 62,160 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు అదనంగా విడుదల చేస్తున్నారు. రాత్రి 9 గంటల సమయంలో శ్రీశైలం జలాశయంలో 882.1 అడుగుల వద్ద 199.2737 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

ప్రవర్తన మార్చుకోకపోవడంతోనే హత్య

- భార్యను తగలబెట్టిన కేసులో భర్త రిమాండ్
- కేసు వివరాలు వెల్లడించిన సీఐ ఇజాజుద్దీన్

మహబూబ్‌నగర్ క్రైం: అనుమానంతో భార్యను అత్యంత దారుణంగా కత్తితో పొడిచి.. పెట్రోల్ పోసి తగలపెట్టిన ఘటనలో భర్తను మహబూబ్‌నగర్ రెండో పట్టణ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. జిల్లాకేంద్రంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఇజాజుద్దీన్ కేసు వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం రాయవరం గ్రామానికి చెందిన శ్రీశైలంకు 2014లో మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం గోటూర్‌కు చెందిన శ్రావణితో ఫోన్ ద్వారా పరిచయం ఏర్పాడింది. అదే ఏడాది ఇద్దరూ ప్రేమ పెళ్లి చేసుకున్నారు. మూడేళ్లపాటు సజావుగా సాగిన సంసారంలో ఆ తర్వాత శ్రావణి అక్క భర్తతో వివాహేతర సంబంధం పెట్టుకుని అతనితో పిల్లలు తీసుకుని వెళ్లిపోయింది. మళ్లీ 2024లో అతని నుంచి విడిపోయి పిల్లల కోసం మనం ఇద్దరం కలిసి ఉండాలని భర్త శ్రీశైలం దగ్గరకు వచ్చింది. మళ్లీ తర్వాత వేరే వ్యక్తితో ఫోన్ చాటింగ్ చేయడం, మాట్లాడటం గమనించిన శ్రీశైలం ఈ ఏడాది జనవరిలో ఆమెను కొట్టాడు. దీంతో శ్రావణి మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శ్రీశైలంపై కేసు నమోదు చేశారు. కొన్ని రోజులు విడిగా ఉండి మళ్లీ రెండు నెలల కిందట కలిశారు. ఇటీవల ఓ వ్యక్తితో ఆమె ఇంట్లో సన్నిహితంగా ఉండగా శ్రీశైలం గమనించాడు. దీంతో ఎన్నిసార్లు చెప్పినా ప్రవర్తన మార్చుకోవడం లేదని నిశ్చయించుకుని పథకం వేసుకున్నాడు. హైదరాబాద్‌లో ఉండే శ్రీశైలం ఎర్రగడ్డలో కత్తిని కొనుగోలు చేసి ఈ నెల 20న సాయంత్రం భార్య శ్రావణికి ఫోన్ చేసి ఈనెల 21న ఉదయం ఇద్దరం కలిసి సోమశిల వెళ్దామని చెప్పాడు. ఈ నెల 21న శ్రీశైలం హైదరాబాద్ నుంచి షాద్‌నగర్‌కు చేరుకుని అక్కడ స్నేహితుడి దగ్గర బైక్ తీసుకుని దాంట్లో ట్యాంక్ నిండా పెట్రోల్ పోయించుకుని మహబూబ్‌నగర్‌కు వచ్చి శ్రావణిని బైక్‌కు ఎక్కించుకుని నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్ గ్రామ శివారులోని అడవిలోకి తీసుకువెళ్లి కత్తితో పొడిచి హత్య చేసి పెట్రోల్ పోసి తగలపెట్టాడు. అయితే ఈ నెల 23న శ్రావణి తండ్రి టూటౌన్‌లో మిస్సింగ్ ఫిర్యాదు ఇచ్చాడని దీనిపై విచారణలో ఉండగా పెద్దకొత్తపల్లి పోలీసులు ఇచ్చిన సమాచారంతో శ్రీశైలంను అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు కృషి


పెన్షనర్లతో మాట్లాడుతున్న డీటీఓ శ్రీనివాస్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలోని పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని డీటీఓ శ్రీనివాస్ అన్నారు. సోమవారం టీడీఓ కార్యాలయంలో పెన్షనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యాలయానికి వచ్చే పెన్షనర్లను వేధించకుండా వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. వారు అడిగిన సమాచారాన్ని అందించాలని అందులో ఏమైనా ఇబ్బందులు ఉంటే సావదానంగా వివరించాలన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2024 నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. 75 ఏళ్లు పైబడిన పెన్షనర్లతో స్వయంగా ఎస్టీఓలను కలిసి వ్యక్తిగత నిర్ధారణ చేసుకోవాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను త్వరగా మంజూరు చేయాలని, పే కమిషన్ రిపోర్టు ప్రకటించాలని, జిల్లాకేంద్రంలో రాష్ట్ర రాజధానితో పెన్షనర్ల సంక్షేమ భవనాలను నిర్మించాలని, నగదు రహిత వైద్య సేవలు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అందించాలని, ప్రతి జిల్లా కేంద్రంలో వైద్యులు, మండలు, వ్యాధి నిర్ధారణ పరీక్షల వసతితో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్న డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీఓకు అందజేశారు. సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు బాలస్వామి, అధ్యక్షుడు పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి రహమాన్, ఉపాధ్యక్షులు వీరేందర్‌జీ, వీణాదేవి, కార్యదర్శులు ఖాజమ్మ, తులసమ్మ, బాలశివుడు, సభ్యులు కొండా రెడ్డి, చెన్నయ్య పాల్గొన్నారు.